

లోక రక్షణార్థమే ఏసు జననం
లోక రక్షణార్థమే ఏసుక్రీస్తు జన్మించారని కార్డినల్ పూల ఆంథోని పేర్కొన్నారు. -10లో



కరోనా తర్వాత..
కరోనా తర్వాత ప్రజల పరిస్థితులు మారిపోయాయని ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి అన్నారు. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
35°/23°
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేవంత్, జానారెడ్డిలకు ఆహ్వానం


రేవంత్‌రెడ్డి, జానారెడ్డిని మేడే కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న జనగాం ఉపేందర్‌రెడ్డి

ఆలేరురూరల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు జానారెడ్డిని మంగళవారం పీసీసీ కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఉపాధ్యక్షుడు జనగాం ఉపేందర్‌రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్‌లు మంగళవారం హైదరాబాద్‌లోని రేవంత్‌రెడ్డి నివాసంలో కలిశారు. మే 1వ తేదీన గాంధీ భవన్‌లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మేడే వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.

పంట నష్టం నివేదిక సమర్పించాలి

భువనగిరిటౌన్: అకాల వర్షాలతో కలిగిన పంట నష్టంపై నివేదికను వెంటనే సమర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. రెండో విడతలో భాగంగా 10,450 ఎకరాల్లో పంట నష్టంపై రైతుల వారీగా బ్యాంకు అకౌంట్ నంబర్లతో సహా సేకరించి ఈ నెల 29నాటికి సమర్పించాలని సూచించారు. 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం వివరాలు సేకరించి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఏఓ అనురాధ, జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి అన్నపూర్ణ, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారిణి సవిత ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

మోత్కూరు: మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రిజిస్ట్రేషన్లతో రూ.4.57కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కొంతమేర తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈసారి రియల్ ఎస్టేట్ బాగాలేదని, రిజిస్ట్రేషన్లు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. మోత్కూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న నాయక్ ఈ నెల 30 వరకు సెలవుల్లో ఉన్నారని, తదుపరి ఆయన విధుల్లో చేరుతారా లేక సెలవును పొడిగించుకుంటారా? అనే విషయం తెలియదన్నారు. మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రశ్నించగా తన దృష్టికి రాలేదని తెలిపారు. తన దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామిని భక్తులు మొక్కుకొని పూజలు చేశారు. ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు.

ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

చౌటుప్పల్: ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చౌటుప్పల్, నారాయణపురం మండలాల క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు, నర్సరీలు, కూలీల హాజరు, రికార్డుల నిర్వహణ, కంపోస్టు తయారీ, లేఅవుట్‌లలో 10శాతం భూమి రక్షణపై సమీక్షించారు. డివిజనల్ పంచాయతీ అధికారి సాధన మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో నారాయణపురం ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నర్సింహారావు, ఏపీఓ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శులు టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జోష్

- ఊరూరా గులాబీ జెండాల రెపరెపలు
- ప్లీనరీల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు
- సమావేశానికి దూరంగా పలువురు నేతలు
- రేపటి ప్రతినిధుల సభకు జిల్లా స్థాయి నేతల హాజరు


యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో నిర్వహించిన ప్లీనరీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, చిత్రంలో ఒంటేరు యాదవరెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్ తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. మొన్నటివరకు ఆత్మీయ సమ్మేళనాలు, ఇప్పుడు ప్లీనరీతో క్షేత్రస్థాయిలోని కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపైంది. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల నేతృత్వంలో పెద్ద ఎత్తున ప్లీనరీలను నిర్వహించారు. ఉదయమే గ్రామాలు, మండలాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించిన అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశాలకు హాజరయ్యారు. అక్కడక్కడ ఆశావహులు సొంతంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించడం, కొంతమంది నేతలు ప్లీనరీలకు దూరంగా ఉండటం మినహా అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

విజయవంతంగా కార్యక్రమాలు

రెండోసారి అధికారంలోకి వచ్చాక బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు పార్టీ పూనుకుంది. ఇందుకోసం గులాబీ శ్రేణులను సిద్ధం చేసేందుకు ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆదేశించింది. ఎమ్మెల్యేలు కూడా నిత్యం స్థానికంగా ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడం తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆ దిశగా కృషి చేసేలా ఆత్మీయ సమ్మేళనాలు, ప్లీనరీలకు శ్రీకారం చుట్టింది. తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించేలా ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేల నేతృత్వంలో రెండు కార్యక్రమాలు విజయవంతమయ్యాయి.

ప్లీనరీల్లో పాల్గొన్న ముఖ్య నేతలు

సూర్యాపేట నియోజకవర్గంలోని చివ్వెంల మండలంలో బీబిగూడెంలో జరిగిన ప్లీనరీలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఉన్నత విద్యా మండలి సభ్యుడు ఒ.నర్సింహారెడ్డి పాల్గొన్నారు. దేవరకొండలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొనగా, మిర్యాలగూడలో గుత్తాతో పాటు ఎమ్మెల్యే భాస్కర్‌రావు, నల్లగొండలో కడియం శ్రీహరి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నకిరేకల్‌లో ఎంపీ లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొనగా, హుజూర్‌నగర్‌లో రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ సోమ భరత్, ఎమ్మెల్యే సైదిరెడ్డి, తుంగతుర్తిలో జెడ్పీ చైర్మన్ దీపిక, ఎమ్మెల్యే గాదరి కిశోర్, కోదాడలో మెట్టు శ్రీనివాస్, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, నాగార్జునసాగర్‌లో ట్రైకార్ చైర్మన్ రామచందర్ నాయక్, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పాల్గొన్నారు. మునుగోడులో గొర్రెల మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, విద్యా మౌలిక వసతుల కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఆలేరులో ప్రభుత్వ విప్ సునీత, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, భువనగిరిలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి సమావేశానికి ముఖ్య నేతలే..

ఈనెల 27వ తేదీన ప్రగతి భవన్‌లో నిర్వహించబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల ముఖ్య నేతలు మాత్రమే హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, డీసీసీబీ చైర్మన్, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ రాష్ట్ర స్థాయి నేతలు, పార్టీ జిల్లా అధ్యక్షులు పాల్గొననున్నారు.

దూరంగా పలువురు నేతలు

ఎమ్మెల్యేల నేతృత్వంలో నిర్వహించిన ఈ ప్లీనరీలకు పలు నియోజకవర్గాల్లో కొంత మంది నేతలు దూరంగా ఉన్నారు. నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. నాగార్జునసాగర్‌లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గం నేతలు దూరంగా ఉన్నారు. ఆయన మాత్రం జనగామ ఇన్‌చార్జి కావడంతో అక్కడికి వెళ్లారు. కోదాడలో మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ శిరీష లక్ష్మీనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని బాబు, ఇతర నేతలు పాల్గొనలేదు. నల్లగొండలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు పిల్లి రామరాజుయాదవ్ దూరంగా ఉన్నారు.

కేసీఆర్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట రూరల్: కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి పథంలో పయనిస్తోందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్‌లో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన ఆలేరు నియోజకవర్గ స్థాయి ప్లీనరీ నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ యాదాద్రి భువనగిరి ఇన్‌చార్జ్ ఒంటేరు యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రతి పేద కుటుంబానికి అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ, అన్ని కులాల వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. అంతకు ముందు రాష్ట్రంలోని అభివృద్ధిపై, కేంద్ర ప్రభుత్వం వైఖరికి సంబంధించి 25 తీర్మానాలు చేశారు. అందులో కరెంటు మోటర్లకు మీటర్లు పెట్టవద్దని, గ్యాస్ పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, విదేశీ బొగ్గును కేంద్రం తీసుకోవడాన్ని వ్యతిరేకించడం, గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించడం, ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు, ఉపాధిహామీ పనుల చట్ట పునరుద్ధరణ, కల్లాల నిర్మాణానికి కేటాయించిన రూ.130 కోట్లు చెల్లించాలని ప్రతిపాదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుధ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులున్నారు.

పోరాటం వృథాయేనా..

- యాదాద్రి, చౌటుప్పల్ డివిజన్ భూసేకరణ ఫైనల్ నోటిఫికేషన్ విడుదల
- భువనగిరి డివిజన్ ఫైనల్ నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు
- కొనసాగుతున్న రాయిగిరి రైతుల పోరాటం


రాయిగిరిలో భూ సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకుంటున్న రైతులు (ఫైల్)

సాక్షి, యాదాద్రి: రీజినల్ రింగ్ రోడ్డులో పోతున్న తమ భూములను కాపాడుకునేందుకు పలు గ్రామాలకు చెందిన బాధిత రైతులు గత కొన్నాళ్లుగా చేస్తున్న పోరాటం వృథా అయింది. యాదాద్రి, చౌటుప్పల్ డివిజన్ భూసేకరణ ఫైనల్ నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో రైతుల నుంచి భూములు దూరమవుతున్నాయి. ఇంతకాలం యజమానులకు వాటిపై ఉన్న హక్కులపై నిషేధం విధించారు. ఇందుకు సంబంధించి జాతీయ రహదారుల సంస్థ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా.. నిర్వాసితులు న్యాయం కోసం అనేక రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. హైకోర్టు, మానవ హక్కుల వేదికను సైతం ఆశ్రయించారు. అయినా ఫలితం లేకపోయింది. రైతుల భూములకు ఇక అవార్డు పాస్ చేయడమే మిగిలింది.

భువనగిరి త్రిడీ గెజిట్ మరికొంత ఆలస్యం

ఉత్తర భాగంగా చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించిన భువనగిరి త్రిడీ నోటిఫికేషన్ (భూసేకరణ చేసే ఫైనల్ నోటిఫికేషన్) జారీ ఆలస్యం కావడంతో రైతులు భూములు ఇవ్వబోమని వివిధ రూపాల్లో పోరాడుతున్నారు. మానవ హక్కుల కమిషన్, హైకోర్టును ఆశ్రయించారు. రాయగిరి, రామకృష్ణాపురం, పెంచికల్ పహాడ్, తుక్కాపురం, గౌసనగర్, ఎర్రంబెల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతులు రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని ఆందోళన చేస్తున్నారు. జాతీయ రహదారులు దిగ్బంధం, భూ సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకోవడం, కలెక్టరేట్ దిగ్బంధం ఇలా పలు రూపాల్లో ఆందోళనలు చేశారు. రాయగిరిలో రైతులను అరెస్ట్ చేసి రెండు రోజులు పోలీసుల బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారులు భూ సర్వే చేశారు. మరో నెల రోజుల్లో భువనగిరి పరిధిలో త్రిడీ గెజిట్ విడుదల చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. అయితే భువనగిరి కంటే ముందుగా జారీ అయిన త్రిడీ గెజిట్ ప్రకారం యాదాద్రి డివిజన్ పరిధిలోని (వీరారెడ్డిపల్లి, ఇబ్రహీంపూర్, కోనాపూర్, దత్తాయపల్లి, వేల్పులి, మల్లాపూర్, దత్తాయపల్లి, చౌటుప్పల్ డివిజన్ పరిధిలోని (పహిల్వాన్‌పూర్, రెడ్ల రేపాక, పొద్దటూరు, వర్కట్ పల్లి, గోకారం, నేలపట్ల, చిన్నకొండూరు, తాళ్ల సింగారం, లింగోజిగూడ, చౌటుప్పల్)లలో అవార్డులు పాస్ చేయనున్నారు.

మార్కెట్ ప్రకారం నష్టపరిహారమివ్వాలి



రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం తీసుకుంటున్న భూమికి బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. మాకు ఉన్న ఎకరంలో 30 గుంటల భూమి రోడ్డుకు పోతుంది. మాకు వ్యవసాయమే జీవనాధారం. ఇటీవల రూ.40 లక్షలకు ఎకరం చొప్పున ఖరీదు చేసుకున్నాం. ప్రభుత్వం మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి.

– గూడూరు మానస, అక్కంపెల్లి మధిర సాయిరెడ్డిగూడెం

న్యాయం చేయాలి



మాకు చౌటుప్పల్ రెవెన్యూ పరిధిలో 108సర్వే నంబర్‌లో ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి మా భూమిలో హద్దులు వేశారు. ఇటీవల సర్వే సైతం చేశారు. 1.6 హెక్టార్ల భూమి(04ఎకరాలు) రోడ్డు నిర్మాణం కోసం తీసుకుంటున్నారు. ప్రభుత్వం చెల్లించే పరిహారంతో సమీపంలోనే ప్లాటు కూడా కొనలేం. రోడ్డు నిర్మాణానికి మేము వ్యతిరేకం కాదు. రైతుల పరిస్థితి అర్థం చేసుకొని న్యాయం చేయాలి.

– ముప్పిడి పాండుగౌడ్, చౌటుప్పల్

భూములు ఇచ్చేది లేదు



రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూములను ఇచ్చేది లేదు. తుర్కపల్లి నుంచి చౌటుప్పల్ మండలాల వరకు రైతులు ఇప్పటికే వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నారు. రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి. ముందుగా గెజిట్ ఇచ్చిన విధంగా రాజాపేట, యాదగిరిగుట్ట, మోటకొండూరు ప్రాంతాల మీదుగా వేయాలి. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుంటున్న ప్రభుత్వాలు భూమికి బదులుగా భూమి ఇవ్వాలి.

– తంగళ్లపల్లి రవికుమార్, ట్రిపుల్ ఆర్ బాధిత రైతుల సంఘం నాయకుడు

భువనగిరిలో భారీ వర్షం


భువనగిరి పట్టణంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కోర్టు ఆవరణలో చేరిన వరద నీరు

అలైన్‌మెంట్ మార్చాలి

భువనగిరి: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయగిరి గ్రామంలోని రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తున్న ప్రదేశాలను భూ నిర్వాసితులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 9వ తేదీ లోపు చేపట్టే భూ నిర్వాసితుల అభిప్రాయం సేకరణలో పార్టీలకతీతంగా పాల్గొని రైతుల తరఫున పోరాటం చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, పాశం శివానంద్, వెంకటేశం, భూ నిర్వాసితుల సంఘం నాయకులు పాండు, అనిల్, రైతులు ఉన్నారు.


వ్యవసాయ స్థలాలను పరిశీలిస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం

భువనగిరి: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఓపెన్ టెన్త్ పరీక్షకు 291 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 253 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 266 మంది హాజరుకావాల్సి ఉండగా 236 మంది విద్యార్థులు హాజరయ్యారు. 30 మంది గైర్హాజరయ్యారు.

మలేరియా నివారణకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ


ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ తివారీ

భువనగిరి: మలేరియా నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ కోరారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిల్పి, జిల్లా మలేరియా అధికారి వినోద్, జిల్లా లెప్రసీ అధికారి పాపారావు, డిప్యూటీ డెమో మధుసూదన్‌రెడ్డి, జిల్లా సహాయక అధికారి మధుమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల శాతం పెంచాలి

భువనగిరిటౌన్: ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల శాతం పెంచాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రిన్సిపాల్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రారంభానికి సిద్ధం చేయాలి

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెంలో పబ్లిక్ రీడింగ్ రూం త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి అండాలును ఆదేశించారు. మంగళవారం ఆయన రీడింగ్ రూం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు.

అర్హులందరికీ పని కల్పించాలి

యాదగిరిగుట్ట రూరల్: ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేట గ్రామంలో ఉపాధి హామీ పనులు, వంగపల్లిలో నర్సరీ పరిశీలించారు.

మలశుద్ధి కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు

- మోత్కూరులో రూ.కోటి వ్యయంతో నిర్మాణం
- గత నెల 31న శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- త్వరలో ప్రారంభంకానున్న పనులు
- మున్సిపాలిటీకి సమకూరనున్న ఆదాయం


మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మలశుద్ధి కేంద్రం ఏర్పాటుకు కేటాయించిన స్థలం

మోత్కూరు: మానవ మల వ్యర్థాలతో ఎరువులు తయారు చేసేందుకు ప్రభుత్వం ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్‌ఎస్‌టీపీ)లను ఏర్పాటు చేస్తుంది. ఈమేరకు మున్సిపాలిటీలకు ఆదాయం సమకూర్చాలని భావిస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో వీటి నిర్మాణాల కోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలో వీటి పనులు పూర్తి కావొచ్చాయి. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని బుర్జునగర్ కాలనీలో వెనుక భాగంలో గల 947 సర్వే నంబర్‌లోని ఎకరం స్థలాన్ని మల వ్యర్థ శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి కేటాయించారు. రూ.కోటి స్టేట్ గ్రాంట్ నిధులతో దీనిని నిర్మించనున్నారు. గత నెల 31న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ శంకుస్థాపన చేశారు. త్వరలో ఈ పనులను ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎర్తిన్ ప్రాజెక్ట్ టెండర్ దక్కించుకుంది. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉంది. 5కేఎల్‌డీ సామర్థ్యం గల ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. నిండిన సెప్టిక్ ట్యాంకులోని (మరుగుదొడ్లు) వ్యర్థాలతో ఎరువుల తయారీ ఈ శుద్ధి ప్లాంట్ లక్ష్యం. పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ఎఫ్‌ఎస్‌టీపీల నిర్మాణం ప్రభుత్వం చేపట్టింది. మానవ మల వ్యర్థాలను మలశుద్ధి కేంద్రాలకు తరలించే విధంగా ప్రజలకు మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కాగా.. తిరుమలగిరి, నేరేడుచర్ల, చిట్యాల, హాలియా మున్సిపల్ కేంద్రాల్లో నేషనల్ గ్రీన్ కోర్ ట్రిబ్యునల్ అనుమతులు రాగానే వీటి నిర్మాణాలు చేపట్టడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

పర్యావరణానికి దోహదపడుతుంది



మానవ వ్యర్థాల శుద్ధి ప్లాంట్ నిర్మాణంతో చెరువు, కుంటలు, బిక్కేరు కలుషితం కాకుండా ఉంటుంది. ప్రధానంగా పర్యావరణానికి ఎంతో దోహదపడనుంది. ఎరువుల తయారీతో మున్సిపాలిటీకి ఆదాయం రానుంది.

– శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, మోత్కూరు

అన్ని మున్సిపాలిటీల్లో ఏర్పాటు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నాం. తిరుమలగిరి, నేరేడుచర్ల, చిట్యాల, హాలియా మున్సిపాలిటీల్లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి వచ్చాక పనులు చేపడతాం. మోత్కూరులో ఇటీవలే ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. పనులను త్వరలో ప్రారంభించనున్నాం.

– సత్యనారాయణ, ఈఈ పబ్లిక్ హెల్త్ విభాగం, నల్లగొండ

పాడి పశువుల వృద్ధికి లింగ నిర్ధారిత వీర్యం

భువనగిరి: పాడి పశువుల వృద్ధికి లింగ నిర్ధారిత వీర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం వీరవెల్లి గ్రామంలో పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కృష్ణ, జెడ్పీటీసీ బీరు మల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరి కోత మిషన్ ఢీకొని రైతు మృతి


ఉపేందర్ (ఫైల్)

గుండాల: ప్రమాదవశాత్తు వరి కోత మిషన్ ఢీకొని రైతు ప్రాణాలు కోల్పోయిన ఘటన మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండకొత్తపల్లి గ్రామానికి చెందిన కన్న ఉపేందర్(35) సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఎరుక రమేష్‌రెడ్డికి చెందిన వరి కోత మిషన్‌తో తన వరి పొలాన్ని కోయించి ధాన్యాన్ని దేవరుప్పులలో విక్రయించాడు. తిరిగి రాత్రి రమేష్‌రెడ్డి తన సొంత పొలాన్ని కోస్తుండగా, ఉపేందర్ అక్కడికి వెళ్లాడు. ఇది గమనించని రమేష్‌రెడ్డి వరి కోత మిషన్‌ను వెనుకకు తీస్తున్న ఉపేందర్‌కు తగిలి వెనుక టైరు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం మృతుడి భార్య యామిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. మిర్యాలగూడ టూటౌన్ సీఐ ఏ. నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రైతుబజారు సమీపంలో ఓ గుర్తుతెలియని మహిళ అనారోగ్యంతో బాధపడుతుండడంతో స్థానికులు అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్ల ఉంటాయని, చామనఛాయ రంగులో, 5.2 అంగులాల ఎత్తు ఉంటుందని సీఐ తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు 8712670150, 9014555290 నంబర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట: కార్మికుల హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. మే 1న కార్మికుల దినోత్సవం సందర్భంగా మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రచురించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను వ్యాపారం సులభతరం పేరుతో బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా చేసిందన్నారు. వెంటనే 4 కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, సీపీఐ మండల కార్యదర్శి జిల్లా జానకీరాములు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గోపగాని రాజు తదితరులు పాల్గొన్నారు.

కన్నీళ్లు మిగిల్చిన వడగండ్లు

- దేవరకొండ, డిండి మండలాల్లో సుమారు 1391 ఎకరాల్లో పంట నష్టం
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు


దేవరకొండ: నేలకొరిగిన వరి పంట


దేవరకొండ: పంట నష్టం వివరాలు సేకరిస్తున్న అధికారులు


డిండి: ఖానాపూర్‌లో దెబ్బతిన్న వరిచేనును పరిశీలిస్తున్న ఏఈఓ సాయితేజ

దేవరకొండ: మండలంలో సోమవారం కురిసిన వడగండ్ల వానకు 391ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తాటికోల్, తెలుగుపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. పంట నష్టపోయిన రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మొత్తం 391ఎకరాలకు గాను 374ఎకరాల్లో వరి, 13ఎకరాల్లో ఆముదం, 4ఎకరాల్లో ఎర్ర మిరప పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

డిండి మండలంలో 1000 ఎకరాల్లో..

డిండి: మండలంలో అకాల వర్షానికి దాదాపు 1000 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు ఏడీఏ వీరప్ప తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రారం, కామేపల్లి, కందుకూర్, ఖానాపూర్, దాసరినెమలిపూర్, కె.గౌరారం, టి.గౌరారం, బొల్లనపల్లి, గోనబోయనపల్లి గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను సంబంధిత ఏఈఓలతో కలిసి ఆయన పరిశీలించారు. వడగండ్ల వానతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి తగు నివేదిక తయారుచేసి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏఓ శివరాం, ఏఈఓలు సాయితేజ, పరమేశ్వరి, సరిత, జ్యోతి ఉన్నారు.


ధాన్యం రాశుల వద్ద చేరిన వర్షపు నీరు

నకిరేకల్‌లో ఈదురుగాలులతో వర్షం

నకిరేకల్: నకిరేకల్ మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో మంగళపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. గ్రామంలోని బస్టాప్ వద్ద కూరగాయల ఆటో మీద చెట్టు కూలి పడింది. ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.


మంగళపల్లిలో ఆటోపై కూలిన చెట్టు

ఇద్దరు దొంగలు అరెస్టు.. రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేట క్రైం: పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సూర్యాపేట పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం ఈ కేసుకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కొత్త బస్టాండ్ వద్ద సీఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ మతీన్, విజయవాడలోని పంజాబ్ సెంటర్‌కు చెందిన షేక్ కరీం అలియాస్ మస్తాన్ బైక్‌పై వస్తున్నారు. వారు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా.. ఈ నెల 15న రాత్రి సమయంలో సూర్యాపేట పట్టణంలోని గోపాలపురం, జమ్మిగడ్డలో రెండు ఇళ్లలో దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన ఒక అపాచీ బైక్, తులంన్నర బంగారు చైన్, లాకెట్, 3తులాల నల్లపూసల గొలుసు, 20తులాల వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులు ఇద్దరిని రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ రాజశేఖర్, ఎస్ఐ యాకూబ్, సిబ్బంది గౌర్ల కృష్ణ, గోదేసి కర్ణాకర్, సైదులు, మధు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

భువనగిరి: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించిన సంఘటన సోమవారం రాత్రి భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఓ మహిళ పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. రోజు మాదిరిగా పండ్లను విక్రయించుకొని సోమవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు గొలుసును అపహరించి పారిపోయాడు. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ వెంకటయ్య తెలిపారు.

లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

మోత్కూరు: లారీ తగిలి విద్యుత్ స్తంభం విరిగిన సంఘటన మంగళవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని నార్కట్‌పల్లి-మోత్కూరు రోడ్డుపై చోటు చేసుకుంది. వివరాలు.. నార్కట్‌పల్లి మండలంలోని కక్కిరేణి నుంచి ధాన్యం లోడ్‌తో మోత్కూరు వైపు వెళ్తున్న లారీ మోత్కూరు పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతో స్తంభం విరిగిపోయింది. ఇది గమనించిన స్థానికులు కేకలు వేయడంతో డ్రైవర్ లారీని నిలిపివేశాడు. విద్యుత్, మున్సిపాలిటీ అధికారులు స్పందించి మోత్కూరు పట్టణంలోని ప్రధాన రోడ్డు వెంట ఉన్న చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలను రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


విరిగిన విద్యుత్ స్తంభం

బతుకుదెరువు కోసం వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో తాత మృతి, మనుమడికి గాయాలు
- జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో చోటుచేసుకున్న ఘటన
- మృతుడి స్వస్థలం మునుగోడు మండల కేంద్రం


ప్రమాదస్థలిలో సైదులు మృతదేహం

దేవరుప్పుల: బతుకుదెరువు కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తాత చనిపోగా, మనుమడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన తాతమనుమళ్లు చినబత్తుల సైదులు(75), తిరుపతి ఆయుర్వేద మందుల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలోనే మంగళవారం సూర్యాపేట- జనగామ రహదారి గుండా మహారాష్ట్రకు మారుతీ వ్యాన్‌లో వెళ్తుండగా సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలోని ధారావత్‌తండా పరిధిలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ఘటనలో సైదులు అక్కడికక్కడే మృతిచెందగా.. మనుమడు తిరుపతి కాళ్లు విరిగి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. సైదులు కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా

- 16 పశువులు మృతి
- మాధారంకలాన్ సమీపంలో 365వ నంబర్ హైవేపై ప్రమాదం


ప్రమాదంలో మృతిచెందిన పశువులు

శాలిగౌరారం: పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తాపడి 16 పశువులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని మాధారంకలాన్ గ్రామ సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా ఏపూరు నుంచి హైదరాబాద్‌లోని మౌలాలికి పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం(టీఎస్ 13 యుసి 5881)ను డ్రైవర్ అతివేగంగా నడపడంతో అదుపుతప్పి శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్ గ్రామ సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారి పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ఉన్న 48 పశువులలో 15 పశువులు ప్రమాదస్థలంలోనే మృతిచెందగా మరో 33 పశువులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన పశువులలో మరొకటి సాయంత్రం మృతిచెందింది. దీంతో మృతిచెందిన పశువుల సంఖ్య 16కు చేరుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో గాయాలపాలైన పశువులను డీసీఎం నుండి బయటకు తీశారు. డీసీఎం డ్రైవర్ పరారయ్యాడని, స్థానిక పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా గాయాలపాలైన పశువులను ఎస్ఐ సూచన మేరకు సర్పంచ్ జేరిపోతుల మంజులచంద్రమౌళి స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ వద్ద ఉంచి గ్రామపంచాయతీ ట్యాంకర్ సహాయంతో తాగునీరు అందించడంతో పాటు గడ్డివేసి కాపాడుతున్నారు.

మూడు ఇళ్లలో దొంగతనం

- మరో ఇంట్లో చోరీ చేసేందుకు యత్నిస్తుండగా గుర్తించిన స్థానికులు
- కేకలు వేయడంతో పారిపోయిన దొంగలు
- చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో ఘటన

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మరో ఇంట్లో దొంగతనానికి యత్నిస్తుండగా స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో పరారయ్యారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్కారం గ్రామంలోని వినాయకనగర్ కాలనీకి చెందిన గడగొట్టి మల్లేష్ ఇంట్లో అద్దెకు ఉండే రాజు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి తమ సొంతూరైన ఆంధ్రా ప్రాంతానికి వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి అర తులం బంగారం చోరీ చేశారు. అంతేకాకుండా సమీపంలోనే ఉండే వంగూరి నర్సింహ కుటుంబ సభ్యులు తమ ఇంట్లోని ఒక పోర్షన్‌కు తాళం వేసి మరో పోర్షన్‌లో నిద్రించారు. ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు లోనికి వెళ్లి బీరువాలోని రూ.10వేల నగదు, వెండి సామాగ్రి ఎత్తుకెళ్లారు. ఇంటికి తాళం వేసి కంపెనీలో డ్యూటీ నిమిత్తం వెళ్లిన బుడ్డ నర్సింహ ఇంట్లో రూ.9వేల నగదును ఎత్తుకెళ్లారు. సమీపంలోనే ఉన్న ఊదరి నరేష్ ఇంట్లో దొంగతనం చేసేందుకు యత్నిస్తుండగా స్థానికులు గుర్తించి కేకలు వేశారు. దీంతో దొంగలు అక్కడి నుండి పారిపోయారు. పారిపోతున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

యాదగిరిగుట్ట రూరల్: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మల్లాపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపురం గ్రామానికి చెందిన బత్తెపు నరేష్(30) మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం తన వ్యవసాయ బావి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి వెంటనే అతడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. కాగా అప్పులు బాధతోనే నరేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలుస్తోంది. మృతుడి తండ్రి కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రావు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రాస్తారోకో


ముక్కుడుదేవులపల్లి స్టేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

ఆత్మకూర్-ఎస్ (సూర్యాపేట): మండలంలోని ముక్కుడుదేవులపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ రైతులు మంగళవారం గ్రామ ఎక్స్‌రోడ్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో అకాల వర్షాలతో తీవ్ర అవస్థలు పడుతున్నామని అన్నారు. గ్రామగ్రామానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం తమ గ్రామంలో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటకు పైగా రాస్తారోకో నిర్వహించడంతో సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న మండల తహసీల్దార్ పుష్ప, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి రైతులతో మాట్లాడి విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రైతులు ఫయాజ్, శ్రీను, మధు, మల్లేష్, లింగయ్య, నాగరాజు, వెంకన్న తదితరులు ఉన్నారు.

బ్రేక్ ఫెయిలై లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

మోత్కూరు: హ్యాండ్ బ్రేక్ ఫెయిలై లారీ కాలువలో బోల్తా కొట్టిన సంఘటన మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. పాటిమట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఎడమ నర్సిరెడ్డి పాటిమట్ల ఎక్స్ రోడ్డు వద్ద ధాన్యం లోడ్ చేసుకొని అక్కడే ఉన్న బస్టాండ్ వద్ద హ్యాండ్ బ్రేక్ వేసి నిలిపాడు. ధాన్యానికి సంబంధించిన పేపర్లు తీసుకురావడానికి వెళ్లగా ఇంజిన్ ఆన్‌లోనే ఉండడంతో హ్యాండ్ బ్రేక్ ఫెయిల్ అయి లారీ ముందుకు కదిలి బృందావం కాలువలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

- కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అనిత సూచనలు


సాగులో ఉన్న టమాట



నడిగూడెం : కూరగాయలలో ప్రధానమైన కూరగాయ టమాట. ఈ పంటను బోర్లు, బావుల కింద జిల్లాలో పలు గ్రామాల్లో రైతులు సాగు చేపట్టారు. ఈ పంటకు అధికంగా ఛీడ, పీడలు ఆశిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఎప్పటికప్పుడు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అనిత చెబుతున్న సలహాలు..

ఆశించే పురుగులు.. నివారణ చర్యలు

కాయతొలుచు పురుగు : ఈ పురుగు టమాట పంటను నష్టం చేసే పురుగుల్లో ప్రధానమైనది. ఇది లేత ఆకులను, కొమ్మలపై ఆశించి తినివేస్తుంది. కోతదశలో ఉన్న కాయలను తొలచి నాశనం చేస్తుంది. అధికంగా పంటను నష్టపరుస్తుంది. దీని నివారణకు ఎరపంటగా బంతిని వేసుకోవాలి(ఒక వరుస బంతి, 16 వరుసలు టమాట వేసుకోవాలి). ట్రికోగ్రామా బదనికలు ఎకరానికి 20,000 చొప్పున పొలంలో విడుదల చేయాలి. ఎకరానికి నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలి. క్రిమి సంహారక మందును పిచికారీ చేసే ముందు కాయలను కోయాలి.

పచ్చదోమ : ఆకుల అడుగు భాగం నుంచి రసాన్ని పీల్చడం వలన, ఆకుట చివర్లు పసుపు పచ్చగా మారి, క్రమేపీ ఆకు అంతా ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకొని దొనెలలాగా కనిపిస్తాయి. దీని నివారణకు డైమీథోయేట్ లేదా పిప్రోనిల్ 2. మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అక్షింతల పురుగు : పిల్లపురుగులు, పెద్ద పురుగులు ఆకుల పత్రహరితమును గోకి తిని వేయును. ఆశించిన ఆకులు తెరవలె కన్పించును. దీని నివారణకు ప్రొఫెనోఫాస్ లీటరు నీటికి 2 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

ఆశించే తెగుళ్లు.. నివారణ చర్యలు..

నారుకుళ్లు తెగులు : ఈ తెగులు ఆశించడం వలన నారుమడిలో మొక్కల మొదళ్లు కుళ్లిపోయి నారు గుంపులు గుంపులుగా చనిపోతుంది. విత్తటానికి ముందు తప్పనిసరిగా 3.గ్రాముల థైరం లేదా మాంకోజెబ్ కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. పిదప ట్రైకోడెర్మా విరడే అను శిలీంధ్రనాశిని 4 గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి నారు పోయాలి. నారుమడిలో తెగులు కనిపించిన వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు తడపాలి.

వడలు తెగులు (బ్యాక్టీరియల్ విల్టు) : ఇది మొక్క అడుగు బాగంలోని ఆకులు పసుపు రంగుకుమారి తొడిమతో సహారాలి తర్వాత మొక్క వడలిపోయి, చనిపోతాయి. దీని నివారణకు బలమైన మొక్కలు నుంచి విత్తనాలను ఎన్నుకోవాలి. తెగులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తెగులు తట్టుకొనే రకాలను వాడుకోవాలి. నేల ఉదజని 3.6నుంచి 5 వరకు ఉన్న ఆమ్ల భూముల్లో ఈ తెగులు తట్టుకుంటుంది. పంట మార్పిడి అవలంభించాలి.

వైరస్ తెగులు : ఈ తెగులు సోకిన మొక్కల ఆకుల మీద, అక్కడక్కడ పసుపు మచ్చలు ఏర్పడి, ఆకులు ముడుచుకొని, మొక్క గిడసబారి ఎండిపోతుంది. ఆకులు పెళుసుగా తయారవుతాయి. దీని నివారణకు తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులును వ్యాప్తి చెందించకుండా రసం పీల్చే పురుగుల(పేనుబంక) నివారణకు అంతర్వాహిక కీటక నాశనులను పిచికారీ చేసుకోవాలి.

ఆకుమాడు తెగులు

ఈ తెగులు ఆకులు, కాండం, కాయల మీద గోదుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడి క్రమేణా ఆకులు మాడి ఎండిపోతాయి. మొక్క దశలో ఎప్పుడయినా ఆశించవచ్చు. తేమ ఉన్న చల్లని వాతావరనంలో ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు 3 గ్రాములు కాప్టాన్ లేదా మాంకోజెబ్ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 3 లేదా 4 సార్లు పిచికారీ చేయాలి.

సలహాలు... సూచనలు

- ఫ్రెంచి చిక్కుడు పంటతో పంటమార్పిడే చేస్తే బ్యాక్టీరియా ఎండు తెగులు కొంతవరకు తగ్గుతుంది.
- ఆవాలు మరియు బంతి, ధాన్యపు పంటలతో పంటమార్పిడి చేయడం వలన నులిపురుగుల ఉధృతి తగ్గుతుంది.
- కిలో విత్తనానికి ముందుగా 3 గ్రా. థైరం ఆ తర్వాత 8 గ్రా.ట్రికోడెర్మా కల్చర్‌తో విత్తనశుద్ధి చేయాలి.
- వేసవిలో దుక్కులు లోతుగా దున్నడం వలన భూమిలో ఉన్న నిద్రావస్థ దశలో ఉన్న పురుగులు చనిపోతాయి.
- ట్రికోడెర్మా కల్చర్ (ఒక కిలో కల్చర్‌ను 10 కిలోల వేప పిండి మరియు 90 కిలోల పశువుల ఎరువులో కలిపి) దుక్కిలో వేసుకోవాలి.
- పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ పంటను అడ్డుపంటగా వేయడం వలన రసం పీల్చు పురుగుల ఉధృతి తగ్గుతుంది. వైరస్ తెగులు కూడా కొంతవరకు తగ్గుతుంది.
- అలాగే పొలంలో అక్కడక్కడ ఆముదం మొక్కలపై ఉన్న గ్రుడ్ల సమూదాయాలను, అప్పుడు పొదగబడిన పిల్ల పురుగులను ఏరివేయాలి.
- పొలంలో అక్కడక్కడ ఎకరానికి 4 చొప్పున పుసుపు రంగు పూసిన రేకులకు ఆముదం లేదా గ్రీజ్ పూసి పెట్టాలి. తెల్లదోమలు వీటికి ఆకర్షింపబడి అతుక్కుంటాయి.
- ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టి పచ్చపురుగు మరియు రబ్బరు పురుగుల యొక్క ఉనికిని గమనించాలి.
- పొలంలో ఎకరానికి 20 పక్షిస్థావరాలను ఏర్పాటు చేయాలి.